సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ములగాడ ఇండోర్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.. అంతరాయం ఉండే ప్రాంతాలు పిలకవానిపాలెం,అన్నపూర్ణనగర్,ఉప్పరకాలనీ, రామ్‌నగర్, శ్రీనివాస్‌నగర్,గుల్లలపాలెం,అశోక్‌నగర్,బర్మాకాలనీ,ఎదురవానిపాలెం,గొందేశివానిపాలెం,హనుమాన్‌సంజీవ్‌కాలనీ ,శ్రీరామ్‌నగర్, పవన్‌పుత్రనగర్,కొడిపందాలదిబ్బ, కుంచుమాంబకాలనీ,శ్రీహరిపురం మెయిన్ రోడ్డు,ఎంఐజీ-1,2,వుడాకాలనీ,ఇందిరాకాలనీ-1,2,ములగాడ,ములగాడ హౌసింగ్‌కాలనీ,ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ.

సెయింటాన్స్ డిగ్రీ విద్యార్థినికి ప్రథమ ర్యాంక్

మల్కాపురం: సెయింటాన్స్ డిగ్రీ కళాశాల బీఎస్సీ(ఎంపీసీ) విద్యార్థిని వసంతలక్ష్మి ఏయూ అనుబంధ కళాశాలల్లో ప్రథమ ర్యాంక్‌తో ప్రతిభ కనబరిచింది. మూడేళ్ల విద్యా సమయంలో ఆమె పది పాయింట్లకు 9.86 పాయింట్లు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో వసంతలక్ష్మిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, తోటి విద్యార్థులు అభినందించారు.

ఏకేసీ కాలనీలో కరెంట్ షాక్ కలకలం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని రేకులషెడ్లలో మంగళవారం రాత్రి పలువురికి కరెంట్ షాక్ కొట్టడం కలకలం రేపింది. ఇళ్లలోని పైపులకు కరెంట్ పాసవ్వడంతో ఫ్యాన్లు, టీవీలు కాలిపోవడంతో పాటు ఓ మహిళ కాలికి ఫ్రిడ్జ్ తగిలి కాలికి గాయమైంది. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఎలక్ట్రికల్ ఏఈతో మాట్లాడి విద్యుత్ సిబ్బందిని రప్పించారు. బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. లూజు కనెక్షన్ల వల్ల గోడలకు కరెంట్ పాస్ అయి సమస్య తలెత్తిందని విద్యుత్ అధికారులు తెలిపారు.

శాకంబరిగా నూకాంబిక



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో వెలసిన శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారిని బుధవారం అమావాస్య సందర్భంగా శాకంబరిదేవిగా అలంకరించారు. 40వ వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

లక్ష్మణరావుకు అభినందనలు



లక్ష్మణరావును సత్కరిస్తున్న మురళి, శివరెడ్డి తదితరులు

మల్కాపురం: టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన నక్క లక్ష్మణరావును షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ యూనియన్ అధ్యక్షుడు ఉరుకూటి మురళి తదితరులు అభినందించారు. నక్కవానిపాలెం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో మురళి,శివారెడ్డి,గొంప చిన్నాజీ తదితరులు ఆయనకు శాలువా కప్పి, కృష్ణుడి ప్రతిమ జ్ఞాపికగా అందజేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా! లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

వైజాగ్ వెస్ట్

8978872250

తుది దశకు టిడ్కో గృహాలు

- పద్మనాభనగర్‌లో 90 శాతం టిడ్కో ఇళ్ల పూర్తి
- శరవేగంగా రహదారుల నిర్మాణం
- చకచకా రిజిస్ట్రేషన్లు



పద్మనాభనగర్‌లో టిడ్కో ఇళ్లు, చురుగ్గా సాగుతున్న రహదారుల నిర్మాణం

గోపాలపట్నం: పేదోడి సొంతింటి కల త్వరలో సాకారం కానుంది. పేదలకు టిడ్కో ఇళ్లు త్వరితగతిన అప్పగించడానికి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో నిర్మాణాలు చేపట్టకుండా చేతులెత్తేసిన టిడ్కో ఇళ్లను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తి చేస్తోంది. దీనిలో భాగంగా పద్మనాభనగర్‌లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. రహదారులు, కాల్వల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో ఇళ్లు మంజూరైన సొంతింటి తాళాలు అందుకోవడానికి ఆశగా ఎదురు చూస్తున్నారు.

14 బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం

ఇక్కడ మొత్తం 14 బ్లాకుల్లో నాలుగు అంతస్తుల్లో ఇళ్లు నిర్మించారు. ఇందులో 430 చదరపు గజాల్లో 432, 365 చదరపు గజాల్లో 366, 300 చదరపు గజాల్లో 48 ఇళ్లు నిర్మించారు.

90 శాతం నిర్మాణాలు పూర్తి

పద్మనాభనగర్ 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. బాత్ రూముల్లో బేషిన్లు, బ్లాక్ బ్లాక్ మధ్య ఉన్న చిన్న రహదారులు వంటివి పూర్తి చేయాల్సి ఉంది. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు

మొత్తం 856 ఇళ్లకు గాను బ్యాంక్ లోన్ వచ్చిన వారికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటికే 190 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. బ్యాంక్ లోన్ మంజూరైతే మిగిలిన వారికి కూడా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. గుత్తేదారులు నిర్మాణాలు పూర్తి చేసి అధికారులకు అప్పగించాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే అధికారులు పంపిణీ చేయనున్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



కోటనరవలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

గోపాలపట్నం/సింహాచలం: నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు తీసుకెళ్లామన్నారు. అవి త్వరలోనే పరిష్కారమవుతాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు వస్తాయన్నారు. వాటి ద్వారా రహదారులు, కాల్వలు బాగు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంట్రెడ్డి మహాలక్ష్మినాయుడు, దాడి నూకరాజు, మళ్ల రమణ, మళ్ల నూక అప్పారావు, శరగడం జగదీఅప్పారావు, కొయిలాడ రామసూరి, వేగి శ్రీరామ్మూర్తి, దొడ్డి రమేష్, గంట్రెడ్డి శ్రీనివాసరావు, చట్టి తాతారావు పాల్గొన్నారు.

సింహగిరిపై ఇంజినీరింగ్ అధికారుల పర్యటన

పలు నిర్మాణాలకు అనువైన ప్రదేశాల గుర్తింపు



సింహగిరిపై పరిశీలన చేస్తున్న ఏయు విశ్రాంత ప్రధాన ఇంజినీర్ మాధవ్, దేవస్థానం అధికారులు

సింహాచలం: సింహగిరిపై పలు నిర్మాణాలు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి బుధవారం ఏయూ విశ్రాంత ప్రధాన ఇంజినీర్ డాక్టర్ జి.మాధవ్, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పర్యటించారు. సుమారు రూ.4 కోట్లతో కార్ల పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి గజపతి కాటేజీ వెనుక వైపు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం, అన్నప్రసాద సత్రంపై ప్రసాదాల తయారీకి అదనపు అంతస్తు నిర్మాణం తదితర ప్రణాళికపై చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

స్మారక భవనం ఏర్పాటుకు వినతి



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న వాసుదేవరావు

డాబాగార్డెన్స్: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న స్మారక భవనాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు కోరారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా జడ్జి కోర్టు సమీపంలోని లచ్చన్న కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ విశాఖలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవేనన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి షీలానగర్ నుంచి అనకాపల్లికి వెళ్లే దారిలో 5 ఎకరాల స్థలంలో స్మారక భవనం, 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో తోట హరిశంకర్, దొంపక భాస్కర్, వెంకటరమణ, జలుమూరు చిట్టిబాబు, మార్కండేశ్వరరావు, అత్తిలి శంకర్రావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ డిపో యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి



మద్దిలపాలెం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం : ఆర్టీసీ స్టీల్ డిపో యాజమాన్యం సిబ్బందిపై వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నీలకంఠం డిమాండ్ చేశారు. చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమంలో భాగంగా మద్దిలపాలెం ఎన్ఎంయూఏ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ డిపోలో అపరిష్కృతమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై 34 రోజులుగా దీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ర్యాలీగా మద్దిలపాలెం నుంచి ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఆర్ఎం కార్యాలయానికి తరలివెళ్లారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నేటి నుంచి బస్సు యాత్ర



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో, ఎంతోమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి. సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 916వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. శిబిరాన్ని సందర్శించిన జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించి, ఉక్కు ఉద్యమంపై ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కర్మాగారం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలో కొనసాగితే నిర్వాసితులకు, కార్మికులకు న్యాయం జరుగుతుందని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌పీలకు బహుమతుల ప్రదానం



ఆర్‌పీలకు బహుమతులు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆర్‌పీలకు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో బుధవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బహుమతులు అందజేశారు. ఏపీడీ శ్రీరామ్, సీవో ఝాన్సీ సమక్షంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలు ఆర్‌పీల్లో ఉత్సాహాన్ని నింపేందుకు దోహదపడతాయని బెహరా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, ఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా డొంకాడ

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా డొంకాడ అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు ఎస్ఎన్‌కే మహంతి, ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి సంయుక్తంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనూషా పట్నాయక్, అఖిల భారత శిష్టకరణ సంఘం అధ్యక్షుడు కె.వేంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర శిష్టకరణ సంఘం గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్, గౌరవ సలహాదారుడు కె.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జయతి ఉమామహేశ్వరరావు, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి పలువురు సంఘ నాయకులు అభినందనలు తెలిపారన్నారు.

ఫొటోగ్రఫీ ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేర్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ప్రదర్శన జరగనుంది. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంగణంలో నిర్వహించే ఈ ప్రదర్శన వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వి.వి.రామరాజు, సభ్యులు కె.ఎం.కె.రమేష్, సన్నీ పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి.

అదనపు టోల్ ఫీజులపై ఆందోళన

అగనంపూడి: అదనపు టోల్ ఫీజుల భారాన్ని నిరసిస్తూ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్‌గేటు వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. గాజువాక, అనకాపల్లి జీవీఎంసీ పరిధిలోనే ఉన్నా అదనపు భారం వేయడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు కోరుపు శ్రీను మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే స్థానిక లారీలకు ఒక పక్క రూ.165 రెండో వైపు మరో రూ.165 వసూలు చేసేవారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఒక వైపు రూ.335, రెండో వైపు మరో రూ.165 టోల్ కాంట్రాక్టర్ వసూలు చేయడం, దానికి హైవే అధికారులు వత్తాసు పలకడం అన్యాయమని పేర్కొన్నారు. గాజువాక ఆర్టీవో విశాఖ పరిధి కాదని, అనకాపల్లి జిల్లాలోకి వస్తుందని కాంట్రాక్టర్ చెప్పడం దారుణమని ఆరోపించారు. ఇలాగే కొనసాగిస్తే వాహనాల రాకపోకలను స్తంభింపజేసి, టోల్‌గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు నెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు రోజులుగా ఎటువంటి సమాచారం లేకుండా అడ్డగోలుగా ఫాస్ట్‌ట్రాక్‌లో కోత విధిస్తున్నారని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని టోల్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. దువ్వాడ పోలీసులు సూచనల మేరకు టోల్ కాంట్రాక్టర్‌తో చర్చించిన ఆందోళనకారులు కేవలం గాజువాక ఆర్టీవో పరిధిలోని గ్రామాల్లో లారీలకు మాత్రమే పాత పద్ధతిలో వసూలు చేయడానికి కాంట్రాక్టర్ అంగీకరించారని తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి గోకుల్‌నగర్, మల్లసూరివీధి, దుర్గానగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందే విధంగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతోనే సచివాలయాలను, వలంటర్ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు.

వారికి ప్రజా సమస్యలు పట్టవు

ప్రజా సమస్యలపై కాకుండా టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ కె వి. నరసింగరావు, 52,56,57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శామ్యూల్, మహిళా నాయకురాలు ఎస్.ఎస్ లత, నాయకులు గల్లా శ్రీను, నమ్మి శ్రీను, సచివాలయ కన్వీనర్లు వెంకటరావు, వెంకటరమణ అప్పలనరసమ్మ, రాజ్యం, హరీష్, స్పందన బాబూరావు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మయన్మార్' అసోసియేషన్ సేవలు అభినందనీయం



సభ్యుడిని సత్కరిస్తున్న అతిథులు, అసోసియేషన్ ప్రతినిధులు

కంచరపాలెం: మయన్మార్ ఆంధ్ర రీపేట్రియాట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారి ఊర్వశి జంక్షన్‌లోని స్టీల్ సిటీ క్యాంప్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డి, కార్యదర్శి డి.ఆర్.మోహన్‌రావుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘంలో సభ్యులుగా ఉన్న రిటైర్డ్ ఉద్యోగులంతా ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథులు బి.ప్రభు, కాళ్ల ఈశ్వరప్రసాద్, పి.సుకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి దశాబ్ది వేడుకలు ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ, కేరళలో ఫ్లడ్ రిలీఫ్ ఫండ్, బర్మాలో కోవిడ్ రిలీఫ్ ఫండ్ వంటి అసోసియేషన్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని వారు కొనియాడారు. సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే రూ.2,500 సాయం అందజేయనున్నట్లు ఎ.ఎం.ఫ్రెడ్డి తెలిపారు. సంఘ సభ్యులకు మెమెంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డి.కృష్ణారావు, ఎం.పి.బాపూజీరావు, డి.ప్రకాష్, వి.ఎస్ మణి, బాబురావురెడ్డి, కె.నాగేశ్వరరావు, ఎండీ దీన్, కె.రాజారావు, పి.కె.సూర్యనారాయణ, బి.ఈ.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వదేవుడు ఒక్కడేనని బోధించే 'బ్రహ్మం సు విష్ణు'



బ్రహ్మంసు విష్ణు సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరుణాభాయ్ తదితరులు

డాబాగార్డెన్స్: బ్రహ్మం సు విష్ణు సినిమా ప్రీమియర్ షోలు దేశ వ్యాప్తంగా ప్రదర్శిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మల్టీ మీడియా చైర్‌పర్సన్ కరుణాభాయ్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను 1971 నుంచి మీడియా రంగంలో ఉన్నానని, 87 ఏళ్లుగా తమ సంస్థ 147 దేశాల్లో సనాతన ధర్మం కోసం కృషి చేస్తోందన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ.. ఆధ్యాత్మిక సంస్థని పేర్కొన్నారు. ప్రేమ, సంతోషం కోసం అన్వేషణ సాగుతోందని, విద్యా సంస్థల్లో వీటిని బోధించడం లేదన్నారు. చిత్ర డైరెక్టర్ ముప్పలనేని శివ మాట్లాడుతూ తాను తెలుగులో తాజ్‌మహల్, సంక్రాంతి వంటి 20 సినిమాలు తీశానని గుర్తు చేశారు. బ్రహ్మంసు విష్ణు సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా షూటింగ్ అంతా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిందని, పాన్‌ఇండియాలో భాగంగా ముందుగా హిందీలో విడుదల కానుందని, గంటన్నర నిడివిలో సినిమా ఉంటుందన్నారు. విశ్వదేవుడు ఒక్కడే అన్నది ఈ సినిమా సారాంశంగా పేర్కొన్నారు. త్వరలోనే సృష్టి అంతమవుతుందని చిత్రంలో చూపించామని వివరించారు. బ్రహ్మ పాత్రధారి అరుణ్‌బాయ్ మాట్లాడుతూ ఈ సినిమాలో బ్రహ్మ రహస్యాలు చక్కగా చిత్రీకరించామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రమా, బీకే శివలీల, సరళ భాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజ్ పోటీల్లో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ

విజేతలకు ప్రిన్సిపాల్ అభినందన



విజేతలతో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: మంగళగిరిలోని ఎయిమ్స్‌లో 5వ కొలొక్వియంలో భాగంగా నిర్వహించిన ఆలిండియా అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అభినందించారు. ఈ పోటీల్లో ఏఎంసీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 12మంది పాల్గొనగా అనాటమీ మోడల్‌లో డి.సాయి వైష్ణవి బంగారు పతకం, అనాటమీలో డి.వి.రంగనాథ్ రజతం, జి.రోష్ని కాంస్య పతకాలు గెలుచుకున్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్ర కిషోర్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మ గీతాంజలి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి శ్రావణ సంగీతోత్సవాలు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు బుధవారం ముగిశాయి. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా కొద్ది రోజులుగా సంగీతోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల్లో భాగంగా నగరంలో పలు మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీలకు చెందిన చిన్నారులతో పెద్ద ఎత్తున సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక, సంగీత, నృత్య ప్రదర్శనలతో పాటు వ్యాస రచన, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బుధవారం జ్ఞాపికలు, పతకాలు అందజేశారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: భారతరత్న, దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయి వర్ధంతి కార్యక్రమం బీజేపీ పశ్చిమ నియోజకవర్గంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్ర పటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడపాటి మాట్లాడుతూ దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పశ్చిమ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్, సీనియర్ నాయకులు జి.సి.నాయుడు, పాలిమేర శ్రీనివాసరావు, మంజుల, బాల రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com